


గుత్తులు గుత్తులుగా విరగ బూసిన గన్నేరుచెట్టు వంక గంటలకొద్దీ చూసుకుంటూ మురిసిపోయేది రాజమ్మ. పక్కింటి కమలమ్మ చిన్న గన్నేరు కొమ్మను తెచ్చి నాటింది ఇంటి ముందు. అది చూస్తూండగానే ఎదిగిపోయింది. ఎప్పుడు చూసినా ఆ చెట్టు క్రిందే కనుపించేది రాజమ్మ. ఆ కొమ్మ మొదటిసారిగా మొగ్గ తొడిగినప్పుడు ఆమె ఆనందంతో గంతులు వేసింది. తన స్నేహితురాళ్లందరినీ పిలిచి చూపి ఒకటే సంబరపడిపోయింది.

ఆనాటి సంతోషం ఈనాడేది? తన సంసారంలాగే నిలిచి ఉంది ఆ గన్నేరు. ఎండిన కొమ్మలు గాలిలో ఊగుతూంటే గుండె బరువెక్కి పోయేది. 'ఏనాటికైనా తన గన్నేరు కొమ్మ తిరిగి చిగురిస్తుందా?' అని బాధ పడేది రాజమ్మ.

తండ్రి పోగానే ఉన్న కాస్త గుడిసె అమ్ముకుని పట్నం వచ్చేసింది. చేతిలో ఉన్న నాలుగు డబ్బులు ఖర్చయ్యేదాకా తిరగని మిల్లు అంటూ లేదు. ఏ మిల్లులోనూ, ఎక్కడా పని దొరకలేదు రాజమ్మకు.

"పని దొరకటం అంటే మాటలా బిడ్డా! అనుకోగానే ఏడ దొరుకుతయ్—నాల్గు దినాలు ఓపిక పట్టాలె.." అంటూ పక్కింటి తాత ఓదార్చేవాడు.

ఒక రోజు రాజమ్మ వంట చేసుకుంటూ ముందు ముందు ఎలాగా అని ఆలోచిస్తూ కుండలో పొంగులెత్తే అన్నంకేసి చూస్తూ దిగులుగా కూర్చుంది. తాత హడావుడిగా వచ్చి, గడప మీద కూర్చుంటూ—"చూడు రాజమ్మా! మన సీతయ్య కనపడి చెప్పాడూ—అన్నట్టు సీతయ్యంటే తెలుసా? రైల్వే వర్క్‌షాపులో పని చేస్తున్నాడు—అతను కనపడి 'పోనీ రాజమ్మను మా వర్క్‌షాపులో బొగ్గులెత్తే పని చూసుకొమని చెప్పకూడదా' అన్నాడు. పోనీ నువ్వెళ్లి కనుక్కోకూడదా ఏదన్నా పని దొరుకుద్దేమో!" అని చెప్పాడు.

రాజమ్మ హృదయంలో ఆశ మెరుపులా మెరిసింది. ఇన్నిదినాలూ తను వెళ్లని ఫ్యాక్టరీ అంటూ లేదు. ఎక్కడికి వెళ్లినా 'ఇప్పుడేమీ ఖాళీలు లేవు' అనిపించుకోవడమే.

మర్నాడు పొద్దున్నే లేచి శుభ్రంగా ఉతికిన ఎర్ర చీర కట్టుకుని, వెలిసిన రవికె తొడుక్కుని, ముఖాన నయాపైసంత కుంకుమ దిద్దుకుని చకచకా వర్క్‌షాపు వైపు వెళ్లిపోయింది రాజమ్మ.

బ్రహ్మాండమైన వర్క్‌షాపు గేటు ముందు నిల్చుంది.

"లోపలకు ఎలా వెళ్లాలి? ఎవర్ని అడగాలి? ఇంతదూరం వచ్చానే, పని దొరక్కపోతే ఏమవ్వాలి" అనే బాధ ఆమె పెద్ద పెద్ద కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తూంది.

ఇంతలో పన్నెండున్నర గంటలైంది. మిల్లు కూతకు సమయం. బిలబిలమంటూ కార్మికులు అందరూ గుంపులు గుంపులుగా బయటకు వస్తున్నారు. అందులో సీతయ్య కనిపిస్తాడేమో అని ఒళ్లంతా కళ్లు చేసుకుని చూస్తూన్న రాజమ్మ కేసి చూసి, 'ఎవరీ చక్కని చుక్క' అనుకుంటూనే గబగబా తాము తెచ్చుకున్న టిఫిన్లు తినడంలో మునిగిపోయారు పనివారు.

అప్పటికి ధైర్యం చేసి ఫోర్మన్ లక్ష్మయ్య రాజమ్మ వద్దకు వచ్చి, "ఎవరు కావాలమ్మా? ఎందుకొచ్చావు?" అని అడిగాడు.

"సీతయ్య కావాలి బాబూ. మీకు తెలుసా సీతయ్య?"

"ఏ సీతయ్య? ఇంతమందిలో సీతయ్యంటే ఎలా తెలుస్తుంది? పోనీ ఏంపని చేస్తున్నాడో ఏ సెక్షనో చెపితే కొంత శ్రమపడి కనుక్కోవచ్చు."

రాజమ్మ దిగులుపడిపోయింది. నిజానికి సీతయ్యను గురించి తనకేమీ తెలియదు. ఏం చేయాలి? పోనీ, ఈయనతో తన పరిస్థితి

**వి. రతన్ ప్రసాద్**

చెప్పుకుంటేమాత్రం తప్పేముంది? మనిషి చూస్తే చాలా మంచివాడులా ఉన్నాడు.

"అం. చూడు బాబూ! నాకు ఇక్కడ ఏదయినా పని దొరుకుతుందా?" తడారిన గొంతుకతో అంది.

"పనా! చాలా కష్టం. అయినా రేపు మా ఆఫీసర్‌ను అడిగి చెప్తాను" అన్నాడు లక్ష్మయ్య.

అమాత్రం ఆధారం దొరికినందుకు ఎంతో మురిసిపోతూ "రేపు ఇదే సమయంలో వస్తా" అంటూ రాజమ్మ తిరిగి వెళ్లిపోయింది.

• • •

మర్నాడు అదే సమయాన—

"బాబూ కనుక్కున్నారా?" అన్న కమ్మని పిలుపు విని చటుక్కున వెనక్కి తిరిగి చూశాడు లక్ష్మయ్య.

"అం. నిన్ననే కనుక్కున్నా రాజమ్మా. కాని, ఆఫీసరు ఏమీ జవాబు చెప్పలేదు. పని తొందరలో ఉన్నట్టున్నాడు. చూడు రాజమ్మా, ఏ సంగతీ కనుక్కుని నేనే వస్తాను. కాస్సేపు రోడ్డు ప్రక్కన ఉండే, ఆ చెట్టు క్రింద నీడలో కూర్చో. ఏం" అంటూ వెళ్లిపోయాడు లక్ష్మయ్య.

ఎర్రగా పూచిన తంగేడు చెట్టు క్రింద కూర్చుని, ఆశ నిరాశల మధ్య ఊగిపోతూ, వచ్చే పోయే జనంకేసి చూస్తూ కూర్చుంది రాజమ్మ. "అబ్బ! ఎన్ని కారియర్లు! ఎన్ని టిఫిన్ డబ్బాలు!! ఒక్కొక్క గంపలో కనీసం 'ఇరవై' కారియర్లైనా ఉంటాయి. అంత బరువు మోసుకుంటూ రావడంకూడ కష్టమే. ఎవరి కారియర్లు వాళ్లకు ఇచ్చేసి అవ్వలు, అమ్మలు చెట్ల క్రింద గుంపులు గుంపులుగా చేరి ఎంత చక్కగా కష్ట సుఖాలు చెప్పుకుంటున్నారో! చూస్తూండగానే అన్ని గంపలూ వెళ్లిపోయాయి. నాలుగు గంటలు కూడ కావస్తూంది. లక్ష్మయ్య ఇంకా రాలేదేమబ్బా...." అనుకుంటూనే ఓ కునుకు తీయబోయింది.

"రాజమ్మా!"

ఉలిక్కిపడి లేచి నించుంది. కునుకు పట్టబోతున్న కళ్లు సంధ్యాకాంతిలో ఎర్రగా పూచిన ఆ తంగేడు పువ్వుల్లాగే కనుపించాయి లక్ష్మయ్యకు.

తాను మంచి వయసులో ఉన్నప్పుడు ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించిన సీత తనను మోసం చేసి వెళ్లిపోయింది. ఇక జీవితంలో చచ్చినా పెళ్లి చేసుకోకూడదని ఒట్టు పెట్టుకున్న లక్ష్మయ్యలో ఇంతకాలానికి రాజమ్మ అందం, అమాయకత్వం, నిస్సహాయత ఎంతో మార్పు తెచ్చాయి.

"చూడు రాజమ్మా, ఇవ్వాల్టికి లాభంలేకపోయింది. పోనీ రేపు వస్తే ఏ సంగతీ తప్పకుండా చెప్తాను" అంటూ చాలా బాధగా చెప్పలేక చెప్పలేక చెప్తూంటే, "పోనీలే, లక్ష్మయ్యా, ఏం చేస్తాను? రేపు వస్తాలే. నాకోసం నువ్వే

కష్టపడగా లేంది, నేను రావడం ఏం కష్టంలే'' అంటూ కాళ్లీడ్చుకుంటూ ఇంటిదారి పట్టింది.

• • •

తిరిగి అదేసమయంలో వాడిన పువ్వులా—నీరసంగా, దిగులుగా చెట్టును ఆనుకొని లక్ష్మయ్య కోసం కాచుక్కూర్చున్న రాజమ్మకు మధురమైన గొంతు వినిపించింది.

''ఇక్కడ ఒక్కదానివీ ఏంచేస్తున్నావు తల్లీ? రోజూ చూస్తున్నా.

''ఎవరికోసం? ఎందుకు?'' అంటూ ఒక అవ్వ నిలబడి ఉంది. చల్లగా కళకళలాడుతూ పార్వతీదేవిలాగ. ఆమె మొహంకేసి చూస్తూ రాజమ్మ జవాబు చెప్పలేకపోయింది. అప్రయత్నంగా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. చిన్నప్పుడే తల్లికి దూరమైన రాజమ్మ తల్లిప్రేమ అంటే ఏమిటో ఎరగదు. ఆ కొద్ది క్షణాల్లోనే తనకు అవ్వ ఎంతో ఆత్మబంధువైనట్టుగా తనకష్టం అంతా వెళ్లబోసుకుంది.

''రాజమ్మ తల్లీ. నేనో సంగతి చెప్తా విను. మనలాంటి ఆడకూతుళ్లకు మిల్లుల్లోనూ, వర్క్‌షాపుల్లోనూ పని దొరుకుతుందా? అది సంపాదించడానికి ఎన్ని అవస్థలు పడాలి తల్లీ! నిన్ను చూస్తే అలాంటి కష్టాలు పడేదానిలాగ కనుపించవు. నువ్వేమీ అనుకోనంటే నేనో సలహా ఇస్తా. ఒప్పుకుంటావా? అలాచేస్తే నామాదిరే నీకూ ఏలోటూ ఉండదు.''

''అయ్యో తప్పకుండా చెప్పవ్వా. నువ్వు ఏంచేయమంటే అదే చేస్తాను. నీకన్న నాకు కావలసిన వాళ్లు ఎవరున్నారవ్వా'' అంటూ గొల్లుమంది రాజమ్మ.

• • •

ఉలికిన ఎర్రచీర ఉదయకిరణంలా మెరుస్తూంటే పచ్చని రవికె, నెత్తిమీద పచ్చని కొత్త గంప, గంపలో తళతళలాడే బరువు కారియర్లు, గంపబరువుకు తీగెలా వంగిన సన్నటి నడుము, ఊతగా ఒక చెయ్యి విసురుకుంటూ, అవ్వ ప్రక్కనే నడిచిపోతూంది రాజమ్మ.

అలాగ బంగారు రేఖలాగ వచ్చే రాజమ్మను ఎగాదిగా చూసే వారెందరో! కాని లక్ష్మయ్య మాత్రం ఆమె ఎడ గంభీరంగా ఉంటూ, మృదువుగా కూడా ఉండే గౌరవం వంటిది ఏదో చూపేవాడు. రాజమ్మకుకూడ ఎందుకో లక్ష్మయ్య వైపు మనస్సు పోయేది. కార్మికుడైన లక్ష్మయ్యకు శ్రమ, కాయకష్టపడడం అన్నీ తెలును. అతనిది హుందా అయిన మంచి మనసు.

ఎవరి కారియర్లు వాళ్లకిచ్చేసి వాళ్లు తినేంత లోగా అయిదారు గజాల దూరంలో ఉన్న వర్క్‌షాప్ కేసి పరుగెత్తేది రాజమ్మ. లక్ష్మయ్యను చూడకుండా ఉండలేకపోయేది. తనేమీ సాయం చేయలేకపోయినా, అవ్వ అయినా నెలకు దాదాపు నలభై రూపాయల ఆదాయం చూపించింది కదా అని సంతోషంగా రాజమ్మతో కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ తెచ్చుకున్న ఏ జొన్నరొట్టో, అన్నమో అమృతంలా తింటూండే వాడు లక్ష్మయ్య.

• • •

మరి కొద్ది రోజులయ్యాక రాజమ్మ ఒక్క లక్ష్మయ్య భోజనమే తెచ్చేది మిల్లుకు. తెగానే భార్యా భర్త లిద్దరూ దూరాన ఒక చెట్టు నీడను కూర్చుని తమ సంసారపు కష్ట సుఖాలు ముచ్చటించుకునేవారు.

• • •

ఒకనాటి ఉదయం లక్ష్మయ్య పనిలోకి వెడుతూ, ''రాజం, చాలా రోజులైందే. ఇవ్వాళ పాలకూర పప్పు వండి, నంజుకోడానికి మిరపకాయలుంచు. నీకంటే నాకే రుచులమీదికి మనసు పోతోందేమిటి?'' అని రాజమ్మ కళ్లల్లోకి కొంటెగా చూశాడు. నెలలు నిండిన రాజమ్మ ముఖం ముద్ద మందారంలా అయింది. బరువైన కనురెప్పలు సిగ్గుతో వాలిపోయాయి. లక్ష్మయ్య భార్యను దగ్గరకు తీసుకుంటూ—

''రోజూ మధ్యాహ్నంపూట భోజనానికి ఇంటికి ఇంతదూరం రావాల్సి వస్తూంది. ఇంకా ఎన్నిరోజులు? మరి పాపను చంక నెత్తుకుని నాకు అన్నం ఎప్పట్నించీ తెస్తావ్...'' అన్నాడు.

''పొండి మీరు....'' అని భారంగా లేచి వంటింట్లోకి వెళ్లిపోయింది రాజమ్మ. నవ్వుకుంటూ లక్ష్మయ్య కూడ వెళ్లిపోయాడు వర్క్‌షాపుకు.

పొయ్యిమీద పప్పు ఉడుకుతూంది. వీధిలో ఎన్నో అమ్మకాలు వినిపిస్తున్నాయి గాని పాలకూర అమ్మే మల్లమ్మ గొంతుమాత్రం వినిపించటం లేదు. కూర్చోలేక కొంచెంసేపు నడుమువాల్చింది. తన భర్తను పోలిన పాప మనస్సులో మెదిలి, తీయని తలపుల్లో మునిగిపోయింది.

అంతలో వీధి తలుపులు ఎవరో బాదుతున్నారు. ''ఆ వస్తున్నా'' అని లేచింది రాజమ్మ. కడుపులో పాప కదిలింది. ''ఎవరబ్బా'' అనుకుంటూ తలుపులు తీసింది. జనం గోలగా అరుస్తున్నారు.

''ఇంజన్‌లో 'జాలీ' విరిగిపోయి భగభగ మండే నిప్పులు లక్ష్మయ్యమీద నిలువెత్తున పడి చనిపోయాడు.....''

''ఆ'' అంటూ గావు కేకతో నేలకూలింది రాజమ్మ.

• • •

అప్పుడే స్పృహ వస్తున్న రాజమ్మకు—

''బిడ్డ ఎంత బాగున్నాడో, గన్నేరు మొగ్గలా ఉన్నాడు.''

''ఎంతో అదృష్టవంతురాలు''—అన్న నర్సుల మాటలు అస్పష్టంగా వినిపించాయి.

''గన్నేరు మొగ్గ....అదృష్టం ... గన్నేరు... అదృ...'' పగిలిన గుండెలోంచి ఎండిన 'గన్నేరు' ఆస్పత్రి గోడల్ని తన్నుకుని ఆకాశనిండా ఎండిన తన కొమ్మల్ని చాచుకుని వి క టా ట్ట హా స ం చేసింది. ★

విడుదల అమ్మకం
కాశ్మీర్ శాలువలు

అందమైన రంగులలో ఒక్కొక్కటి రూ. 6/— రెండు శాలువలు కొంటే ఒక ఎలెక్ట్రిక్ హీటరు ఉచితము. పోస్టేజి రు. 1—50 స్టాకు మితముగా ఉన్నది. నేడే ఆర్డరివ్వండి.
ANGORA FABRICS (WAPV)
Kirti Nagar, N. Delhi-15.






"సులేఖ" మరియు "బ్రీఫ్‌మన్" ఫౌంటెన్‌పెన్‌లు
హెడ్డాఫీసు: పెన్‌మెన్ ఇండస్ట్రియల్, సర్వీసెస్, బొంబాయి—67.
బ్రాంచి: ఫౌన్‌పెన్ ఇండస్ట్రియల్ సర్వీసెస్, ఇమాంపంజావీధి, బట్టలమార్కెటువద్ద, విజయవాడ.